క్లుప్తంగా

ఎన్‌ఎస్‌ఎస్‌తో సమాజ సేవకు అవకాశం



ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో అధ్యాపకులు

రంపచోడవరం: విద్యార్థులకు సమాజ సేవ చేసేందుకు ఎన్‌ఎస్‌ఎస్ ఎంతో దోహదం చేస్తోందని రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మాకర్‌బాబు అన్నారు. కళాశాలలో ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లును ఎంపిక చేసి సత్కరించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవో డి.రవికుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు గురించి తెలిపారు. అలాగే గోదావరి వరద బాధితులకు సహాయం చేయడం జరిగిందన్నారు.అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నేతల ధర్నా



నినాదాలు చేస్తున్న విద్యార్థులు

అరకులోయటౌన్: అరకులోయ ప్రభుత్వ జూనియర్ కళాశాల భూములను ప్రభుత్వ అధికారులు పరిరక్షించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించి, కళాశాల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ ఉమ్మడి జిల్లా మాజీ సహాయ కార్యదర్శి పి.రామన్న, మండల కార్యదర్శి ఏసుబాబు మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సుమారు 8.50 ఎకరాల స్థలం ప్రహరీ లేక కొంత స్థలం కబ్జాకు గురైందని ఆరోపించారు. కళాశాల స్థలాన్ని కాపాడాలన్నారు. మరమ్మతుకు గురైన భవనాలు బాగుచేయాలన్నారు. నాయకులు సందీప్, మనోహర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

30 లోగా ఈ-క్రాప్ నమోదు



గన్నవరంలో ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఎటపాక: మండలంలోని రైతులంతా ఈనెల 30లోగా ఈ-క్రాప్ చేయించుకోవాలని మండల వ్యవసాధికారి రాబిన్‌సుదర్శన్ ఆదివారం తెలిపారు. ఇప్పటి వరకు 860 హెక్టార్ల వరి, 1250 హెక్టార్లు పత్తి పంటలకు ఈ-క్రాప్ చేసినట్టు పేర్కొన్నారు. ఈ-క్రాప్‌లో చేసుకోవాల్సిన వారు సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను కలిసి వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. పట్టాదారు పాసుబుక్, ఆధార్ జెరాక్స్, ఫోన్ నంబర్ తెచ్చుకోవాలని తెలిపారు.

రాజవొమ్మంగిలో భారీ వర్షం



రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం

రాజవొమ్మంగి: మండలంలో ఆదివారం భారీ వర్షం నమోదైంది. దీంతో గెడ్డలు పొంగి ప్రవహించాయి. వ్యవసాయ భూముల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడి దాదాపు గంటన్నరకు పైగా వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇంటిల్లిపాది కలుపు తీత తదితర వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. బర్లీ పొగాకు, పత్తి తోటలకు ఈ వర్షం మేలు చేస్తుందని భావిస్తున్నారు. మరోవైపు రైతులు జీడిమామిడి తోటల్లో కూడా పనులు చేపడుతున్నారు

వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

చింతపల్లిరూరల్: మండలంలో కొత్తపాలెం, కుడుమసారి, తాజంగి పంచాయతీల్లో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్ల పోస్టులకు ఈ నెల 27న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఆశాజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

ఊరూరా.. సెల్ సేవలు

- జోరుగా టవర్ల నిర్మాణాలు
- ముఖ్యమంత్రి జగన్‌కు గిరిజనుల కృతజ్ఞతలు

వై.రామవరం: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఊరూరా సెల్‌టవర్ల నిర్మాణం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వంలోనూ మెరుగుపరచని కమ్యూనికేషన్ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గ్రామాల్లో సెల్ టవర్లు నిర్మిస్తూ, కమ్యూనికేషన్ మెరుగుపరచడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సుమారు 50 సెల్‌టవర్ల వరకు నిర్మిస్తున్నారు. ఎయిర్‌టెల్ కమ్యూనికేషన్ సంస్థ ముందుకు వచ్చి ఏజెన్సీలో సెల్ టవర్లను నిర్మిస్తోంది. ఇప్పటికే 18 టవర్ల నిర్మాణం పూర్తి చేసుకుని సేవలందిస్తున్నాయి. మిగిలిన టవర్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి.

తీరిన కష్టాలు

గత ప్రభుత్వాల హయాంలో ఒక్క మండల కేంద్రమైన వై.రామవరంలో తప్ప మరెక్కడా సెల్‌టవర్లు ఉండేవి కావు. లోతట్టు గ్రామాల ప్రజలు దూర ప్రాంతానికి సమాచారం అందించాలంటే చాలా ఇబ్బందులు పడేవారు. సుమారు 20 నుంచి 40 కిలోమీటర్ల దూరం మండల కేంద్రానికి వచ్చి, ఫోన్ ద్వారా సమాచారం అందించుకోవాల్సి వచ్చేది. అయితే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఏజెన్సీ ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, ఊరూరికి సెల్‌టవర్లు నిర్మించి, పూర్తిస్థాయిలో కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుపరచడం పట్ల మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెల్ టవర్ల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, నిర్మాణాలకు సహకరించిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిలకు మండల ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.



కోట గ్రామంలో సెల్ టవర్

టవర్ల నిర్మాణానికి విశేష కృషి



గత టీడీపీ ప్రభుత్వం చేయని కమ్యూనికేషన్ వ్యవస్థను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేష కృషి చేసి సెల్ టవర్లు నిర్మిస్తోంది. మండలంలో సుమారు 60 వరకు టవర్లు నిర్మిస్తున్నారు. రాచపాలెంలో టవర్లు ఇప్పుడు నిర్మిస్తున్నారు. స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను.

– కడబాల ఆనందరావు. ఎంపీపీ, వై.రామవరం

జగనన్నకు కృతజ్ఞతలు



ఇంతవరకు మా గ్రామంలో సెల్ టవర్ లేదు. గత ప్రభుత్వాలకు మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథుడు లేడు. సీఎం జగనన్న కృషితో ఇప్పుడు మాకు కోట గ్రామంలో సెల్‌టవర్ నిర్మించారు. ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– ముర్ల జోగిరెడ్డి, సిరిమెట్ల గ్రామం, కోట పంచాయతీ, వై.రామవరం మండలం

తొలగిన ఇబ్బందులు



మా గ్రామానికి కమ్యూనికేషన్ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. గత ప్రభుత్వాలకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రభుత్వ హయాంలో మాగ్రామంలో సెల్‌టవర్ నిర్మించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– వెదుళ్ళ తిరుపతిరెడ్డి, రేగడిపాలెంగ్రామం, వై.రామవరం మండలం

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలు

అడ్డతీగల: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గామాల్లో విస్తృతంగా నిర్వహిస్తున్నారు.అడ్డతీగల మండలంలోని దుప్పులపాలెం, ఎల్లవరం పిహెచ్‌సిల పరిధిలోని 99 గ్రామాల్లో సిబ్బంది గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలను నమోదు చేసుకుని అవసరమైన వారికి తగిన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఈ నెల 30 నుంచి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్న నేపథ్యంలో ముందస్తుగా సర్వే చేశారు. ఇందులో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది బ్లడ్ గ్లూకోజ్, బీపీ, హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు చేస్తున్నట్లు ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.భాస్కర్ తెలిపారు. సర్వే ముగిసిన అనంతరం వైద్య శిబిరాల్లో అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నట్లు అయితే అటువంటి వారిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేస్తామన్నారు. సర్వేలో వచ్చిన వివరాల మేరకు ఎక్కడెక్కడ వైద్య శిబిరాలు నిర్వహించాలో షెడ్యూల్ తయారు చేస్తామన్నారు.

గంగవరం : మండలంలోని గంగవరం, పిడతమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం ఆదివారం జరిగింది. వైద్యులు, వైద్య సిబ్బంది ఇంటింటా పర్యటిస్తూ ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్నారు. వైద్యాధికారులు భావన, సాయిరతన్ ఆధ్వర్యంలో కొత్తాడ, గంగవరం గ్రామాల్లో సర్వే నిర్వహించారు.



కొత్తాడలో స్థానికుల నుంచి ఆరోగ్య సమాచారం సేకరిస్తున్న వైద్య సిబ్బంది

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి రక్త పరీక్షలు కోసం టోకెన్లు అందించారు. ఆరోగ్య సురక్షా వైద్య శిబిరంలో ఏడు రకాల వైద్య రక్త పరీక్షలను నిర్వహిస్తారని వీటిని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో అక్టోబర్ 3 నుంచి 27వ తేదీ వరకు రెండు వైద్య బృందాలతో 18 గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి వైద్య బృందం 3న కె.కోడాపల్లి సచివాలయంలో డాక్టర్ రవిచంద్రశేఖర్ ఆధ్వర్యంలో, 5న సొలభం గ్రామ సచివాలయంలో డాక్టర్ ఆర్.సోందొర, 9న భీరం గ్రామ సచివాలయంలో డాక్టర్ రవిచంద్రశేఖర్, 13న పెదలోచలి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో డాక్టర్ ఆర్.సోందొర, 19న కోరాపల్లి గ్రామ సచివాలయంలో డాక్టర్ టి.శశికాంత్,21న సింగర్భ గ్రామ సచివాలయంలో డాక్టర్ రవిచంద్రశేఖర్, 26న వంజరి గ్రామ సచివాలయం పరిధిలో తాజంగి పీహెచ్‌సీ డాక్టర్ వి.సావిత్రి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరగనున్నట్లు పేర్కొన్నారు. రెండవ వైద్య బృందం అక్టోబర్ 4న పాలమామిడి గ్రామ సచివాలయం పరిధిలో కొక్కిరాపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో డాక్టర్ టి.శశికాంత్ ఆధ్వర్యంలోను ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందన్నారు. 7న జి.మాడుగుల గ్రామ సచివాయలంలో టి శశికాంత్, 10న నుర్మతి గ్రామ సచివాలయం పరిధిలో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలోను, 12న వంతాల సచివాలయం ఎంపీయుపీ పాఠశాలలో డాక్టర్ ఎస్.విగ్నేష్, 16న గడుతూరు గ్రామ సచివాలయంలో డాక్టర్ ఆర్.సోందొర, 18న సొలభం గ్రామ సచివాలయం పరిధిలో ఎంపీయూపీ పాఠశాలలో డాక్టర్ ఎస్.విగ్నేష్, 20న పెదలువ్వాసింగి గ్రామసచివాయలం పరిధిలో ఎంపీపీ పాఠశాలలో డాక్టర్ రవిశంద్రశేఖర్, 25న బొయితిలి గ్రామ సచివాలయంలో గోమంగి పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ చైతన్య, 27న వంజరి-2గ్రామ సచివాలయంలో గెమ్మెలి పీహెచ్‌సీకి చెందిన డాక్టర్ .విగ్నేష్ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు.

జై జై గణేశా.. బై బై గణేశా

- ఘనంగా గణనాథుని నిమజ్జనం
- చిన్నారులు, యువత సందడి



దుంబ్రిగుడలో గణనాథుని ఊరేగింపులో గ్రామస్తులు



సతకంపట్టు వద్ద అన్నసమారాధనలో భక్తులు

దుంబ్రిగుడ: వినాయక చవితి వేడుకల్లో జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లోని మండపాల్లోని గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గణనాథుని విగ్రహాలను భారీగా ఊరేగించారు. థింసా నృత్యాలు, కోలాటాల నడుమ ఊరేగింపు సాగింది. అనంతరం గణనాథుని విగ్రహాలను సమీప నదీజలాల్లో నిమజ్జనం చేశారు. దుంబ్రిగుడ మండల కేంద్రంలో విగ్రహ దాత రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భారీ ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం చాపరాయి జలపాతంలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని సతకంపట్టు వీధి, మోదకొండమ్మ ఆలయం, టీచర్స్ కాలనీ, కామయ్యపేట జంక్షన్‌లతో పాటు మండలంలోని పలు గ్రామల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సతకంపట్టు వీధిలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగ జిల్లా ప్రదాన కార్యదర్శి నైని సత్తిబాబు, బాకురు ఎంపీటీసీ సభ్యురాలు నైని రజని, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమతో పాటు గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం భారీ అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. టీచర్స్‌కాలనీ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని డప్పు వాయిద్యాలు, థింసా నృత్యాలతో ఊరేగిస్తు నిమజ్జనం చేశారు.



హుకుంపేటలో సందడి చేస్తున్న యువత

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి, జడ్డంగి, చెరకుంపాలెం, లబ్బర్తి, ఒట్టిగెడ్డ తదితర గ్రామాల్లో వినాయకుని నిమజ్జనోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. డప్పువాయిద్యాల నడుమ గణేష్‌ను అంగరంగ వైభవంగా ఊరేగించారు.

చిన్నారులు, యువత సందడి చేశారు. చెరకుంపాలెంలో సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు నేతృత్వంలో గణేశ్ మండపం వద్ద భారీ అన్నదానం జరిగింది. స్థానిక బీసీ కాలనీ, శివాలయం మెట్ల వద్ద ఏర్పాటు చేసిన మండపాల నుంచి భక్తులు వినాయకుడిని ట్రాక్టర్‌పై ఊరేగిస్తు తీసుకొని వెళ్లి ఒట్టిగెడ్డ రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు.



రాజవొమ్మంగిలోని ఊరేగింపులో చిన్నారులు, యువత సందడి

27న లక్ష్మీ గణపతి స్వామి ఊరేగింపు, నిమజ్జనం

అడ్డతీగల: అడ్డతీగలలోని లక్ష్మీగణపతి స్వామి ఆలయంలోని నెలకొల్పిన గణనాథుని భారీ విగ్రహాన్ని ఈనెల 27 న ఊరేగింపుగా మద్దిగడ్డ జలాశయం తీసుకెళ్లి నిమజ్జనం చేయనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. యూనియన్ సభ్యులు ఉదయం 8 గంటలకు ఆలయం వద్దకు రావాలని పేర్కొన్నారు.అన్నసంతర్పణ కార్యక్రమం అక్టోబర్ 2 నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రయాణికులకు తప్పని అవస్థలు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో బస్ షెల్టర్ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండైనా, వానైనా ఆరుబయటే బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు. రంపచోడవరం, అడ్డతీగల, ఏలేశ్వరం, రాజమహేంద్రవరం, కాకినాడ, నర్సీపట్నం వైపు ప్రయాణించేందుకు రాజవొమ్మంగి బస్ స్టాప్‌లో నిత్యం వందలాది ప్రయాణికులు వేచి ఉంటారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్ సెల్టర్ ఏర్పాటుకు సంభందిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించరూ..

ముంచంగిపుట్టు:మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ బోండాపుట్టు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో తాగునీటి పథకాలు లేక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు సత్యవతి, సుభద్ర, గురుబరి, మచ్చెల్, గౌరి, లక్ష్మీ, దమయంతి చెబుతున్నారు. గత్యంతరం లేక కిలోమీటరు దూరంలో గెడ్డ నుంచి నీరు తీసుకు వస్తున్నామంటున్నారు. గ్రామంలో తాగునీటి సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఘనంగా పసల మారమ్మ పండగ



పసల మారమ్మ ఊరేగింపు

మునగపాక: మునగపాకలో ఆదివారం పసల మారమ్మ పండగ ఘనంగా జరిగింది. భారీ ఊరేగింపు నిర్వహించారు. మహిళలు ఘటాలు పట్టుకుని అమ్మవారి ఆలయం వద్దకు చేరి, పూజలు నిర్వహించారు. సర్పంచ్ అప్పారావు, ఉప సర్పంచ్ సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ టెక్కలి కొండలరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఊరేగింపులో పాల్గొన్నారు.

ఘనంగా లూథరన్ మిషన్ వార్షికోత్సవం

అరకులోయటౌన్: అరకులోయ లూథరన్ మిషన్ 30వ వార్షికోత్సవాన్ని బెంజిపూర్ ప్రార్థన మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లూథరన్ మిషన్ డైరెక్టర్ రెవరెండ్ బి.ఇ. సంజీవ్ కుమార్ మాట్లాడారు. 1993వ సంవత్సరం సెప్టెంబర్‌లో అరకులోయ లూథరన్ మిషన్ బాధ్యతలను అప్పటి మిషన్ డైరెక్టర్ అలో కుమార్ పాత్రో నుంచి స్వీకరించి, అప్పటి నుండి ఇప్పటి వరకు గిరిజన ప్రాంతంలో సేవలు అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా స్తుతి, కృతజ్ఞత ఆరాధన, ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం నిర్వహించినట్టు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతంలో లూథరన్ సంఘాలలో మందిరములు నిర్మించేందుకు సహాయ సహకారాలు అందించిన సంఘ కాపరులకు, సంఘ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పలువురు సంఘ పెద్దలకు జ్ఞాపికలు అందజేశారు. సంఘ పెద్దలు శాంతి భూషణ్ రాజు, కిల్లో నారాయణ, రాజు, ప్రధాని ఆశీర్, సునీత, సరస్వతి, సంజీవ్ ప్రసాద్, తీలవతి, దొర మనోహర్, కావేరి, అప్పలరాజు, జాన్ మేరి, యువకులు ఆనం చంద్, ప్రతాప్, రాజ ప్రసన్న, ఆర్యవర్ధన్, మేరిమణి, వెరోనికా లిజ్జా, సుకూరుగుడ, కరసాలిగుడ, పిట్టమామిడివలస, బెంజిపూర్ సంఘస్థులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.



కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్ సంజీవ్‌కుమార్ తదితరులు

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

అరకులోయటౌన్: మండలంలోని ఇరగాయి పంచాయతీ పరిధిలోని ఇరగాయి, పెదవలస, ఉరుములు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం స్థానిక నాయకులతో కలిసి ఆదివారం పర్యటించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని, అందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రతీ కార్యకర్త రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో మరలా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీలు శత్రుఘ్ను, కిల్లో నొబో, స్వాభి రాంచందూర్, మాజీ సర్పంచ్‌లు రఘునాథ్, లక్ష్మణరావు, వార్డు సభ్యులు రామారావు, జయరాం, నాయకుడు రామ్మూర్తి, గ్రామస్తులు వెంకటరావు రఘురాం, చైతోస్, రఘురాం, చైతోస్, సింహాచలం, ప్రసాద్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



ఇరగాయి గ్రామంలో పర్యటిస్తున్న నాయకులు

మండలంలో విస్తృతంగా అభివృద్ధి పనులు

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కడబాల ఆనందరావు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీలు పదువులు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించినట్టు చెప్పారు. మండలాభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన వారికి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మండలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రభుత్వానికి మంచి పేరు తెస్తామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పలువురు మాట్లాడుతు ఇప్పటివరకు మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ కరణం కనకరాజు, జిల్లా కమిటీ సభ్యులు గుడ్ల త్రిమూర్తులు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కడబాల ఆనందరావు

ఘనంగా అన్నసమారాధన

వై.రామవరం: వినాయక నిమజ్జాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసులు ఘనంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 250 మందికి పైగా భక్తులు ప్రసాదాన్ని స్వీకరించినట్టు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తెలిపారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్‌లు పాల్గొని భోజనాలు వడ్డించారు. అనంతరం వినాయక నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



అన్న సంతర్పణ కార్యక్రమంలో భోజనాలు వడ్డిస్తున్న అధికారి నాయుడు

150 మందికి వైద్య పరీక్షలు

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ ద్వారా అందించే ఉచిత సేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ అన్నారు. రంపచోడవరంలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. రామకృష్ణ మఠం మేనేజర్ స్వామీరఘువీరనందజీ మహరాజ్, బ్రహ్మచారి రాహుల్ మహరాజ్ తదితరులు శిబిరాన్ని సందర్శించి, సేవలను పరిశీలించారు. వైద్యులు జి.భాస్కర్, రాయుడు శ్రీనివాస్, టి.వి.సుబ్బారావులు సుమారు 150 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలు చేశారు.. క్యాంప్ కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాస్, వలంటీర్లు వెంకటలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు. రోగులకు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించినట్టు స్వామీజీ తెలిపారు .



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న స్వామీజీ

ముసురుమిల్లి కెనాల్ పరిశీలన

రంపచోడవరం: ముసురుమిల్లి ప్రాజెక్టు కెనాల్ ద్వారా వెళ్తున్న నీరు తామరపల్లి వద్ద కాలువ గట్టుపై వరకు వచ్చి ప్రవహిస్తుందని ఎంపీటీసీ కుంజం వంశీ అన్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఆయన ఆదివారం రైతులతో కలసి అక్కడి వెళ్లి కాలువ గట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ గట్టుకు సమానంగా నీరు ప్రవహిస్తోందని, అంతకు మించి ప్రవహిస్తే దిగువనున్న పొలాలకు నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ఐటీడీఏ పీవోతో పాటు ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీపీ, జెడ్పీటీసీలకు తెలియజేసి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



ముసురుమిల్లి కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీటీసీ వంశీ

వెంకన్నకు విశేష పూజలు

అనకాపల్లిటౌన్: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం ఆలయ భేడా మండపంలో అష్టదిక్పాలక ప్రాకారసేవ నేత్రోత్సవంగా జరిగింది. ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ, అర్చన అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబులు తదితరులు నిర్వహించారు.

నేడు బాల వినాయకుడికి లక్ష బిల్వార్చన

మాడుగుల: నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మూడు రోడ్ల కూడలి వద్ద బాల వినాయకుడికి సోమవారం ఉదయం లక్ష బిల్వార్చన చేయనున్నట్టు బాల వినాయక సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఇక్కడ 68 ఏళ్లుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.